జిల్లాలో 278 ఎకరాల్లో పంట నష్టం

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలకు కొడకండ్ల, జఫర్‌గడ్ మండలాల్లో 96 మంది రైతులకు సంబంధించిన 278 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ విభాగం అధికారులు తెలిపారు. ఇందులో వరి 158 ఎకరాలు, పత్తి 120 ఎకరాలున్నట్లు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. దేవరుప్పుల మండలం కడవెండి వాగులో వరద ఉధృతికి 80 గొర్రెలు కొట్టుకుపోయినట్లు తెలిపారు. నర్మెట, చిల్పూరు, తరిగొప్పుల, జఫర్‌గడ్, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి మండలాల్లో 12 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు వెల్లడించారు. జనగామ మండలం వడ్లకొండ–హుస్నాబాద్ రహదారిలోని తాత్కాలిక కల్వర్టు, తరిగొప్పుల మండలం సోలిపురం–పోతారం రోడ్డు, లింగాల ఘనపురం మండలం కుందారం–పటేల్‌గూడెం రహదారి, జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి (జీ) నుంచి పాలకుర్తి వెళ్లే బీటీ రోడ్డు, తమ్మడపల్లి (ఐ) వద్ద చెరువుకు బుంగ పడి ఆనకట్ట దెబ్బతిన్నట్లు తెలిపారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కేజీబీవీ తనిఖీలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

నర్మెట, సెప్టెంబర్ 2 : విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ కేజీబీవీ ఎస్‌వో రజితను ఆదేశించారు. మండలంలోని మాన్‌సింగ్‌తండాలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను రోహిత్‌సింగ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. బియ్యం సరిగా లేవని ఇంకా మెరుగుగా వండాలన్నారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలను తొలగించాలని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎస్‌వో రజితను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాయిబాబా, ఉపాధ్యాయులు ఉన్నారు.

మహాదేవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రఘునాథపల్లి, సెప్టెంబర్ 2 : మండల కేంద్రంలోని మహాదేవస్వామి ఆలయంలో సోమవారం పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య పురస్కరించుకుని శివుడికి పవిత్రమైన రోజు కావడంతో ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్‌గుప్తారేణుక దంపతులు అన్నదానం చేశారు. ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ హోమం, అన్నపూజ జరిపించారు. ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని దేవుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకులు చింతకింది కృష్ణమూర్తి, వేద కుమార్, జ్యోతి, రమ, చిరంజీవి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్మెట ఠాణాను తనిఖీ చేసిన జనగామ ఏసీపీ

నర్మెట, సెప్టెంబర్ 2 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను జనగామ ఏసీపీ పార్థసారథి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఠాణాలో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సమీపించినందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాల నిర్వాహకులకు సూచనలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నైనాల నగేశ్ పాల్గొన్నారు.

మూఢవిశ్వాసాలను రూపుమాపేందుకు జేవీవీ కృషి

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 2 : జన విజ్ఞాన వేదిక (జేవీవీ) 5వ జిల్లా మహాసభలు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగాయి. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ మూఢ విశ్వాసాలను నిర్మూలించడానికి, విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు జేవీవీ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బీ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఏ ఉమాదేవి, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ గోపాల్‌రెడ్డి, డాక్టర్ మనస్విని, సాంబరాజు యాదగిరి, కోశాధికారి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా పీ చంద్రశేఖర్‌రావు, కేఎల్ మల్రెడ్డి, డీ సత్యప్రకాశ్, పీ శోభన్‌బాబు, కార్యదర్శులుగా జీ శోభన్‌రెడ్డి, డీ శ్రావణ్, ఎస్ సత్తయ్య, పీ యాదగిరి, టీ నీలకంఠం, జీ కృష్ణ ఎన్నికయ్యారు.

ఫంక్షన్‌హాళ్లలో డీజే, క్రాకర్లకు అనుమతి లేదు : ఎస్సై

దేవరుప్పుల, ఆగస్టు 2: మండలంలోని ఫంక్షన్‌హాళ్లలో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాల సందర్భంగా డీజేలు వినియోగించొద్దని, క్రాకర్లు కాల్చొద్దని ఎస్సై సృజన్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనిపై ఆయా ఫంక్షన్‌హాల్ యజమానులకు నోటీసులు అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు పెట్టొద్దని, క్రాకర్లు కాల్చొద్దన్నారు. మరోవైపు లౌడ్ స్పీకర్లు రాత్రి 10 గంటల వరకే అనుమతులు ఇస్తామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-000

CHANGE OF NAME

★I, KARTHEEK REDDY MATTA F/o MATTA ADITH REDDY R/o 6-2-41 KAKAJI COLONY HANAMKONDA WARANGAL TG 506001 GOT CHANGED MY MINOR SONS NAME TO MATTA AADITH REDDY.
NT-331741

★I, KARTHEEK REDDY MATTA F/o MATTA ARADYA SIRI REDDY R/o 6-2-41 KAKAJI COLONY HANAMKONDA WARANGAL TG 506001 GOT CHANGED MY MINOR DAUGHTERS NAME TO MATTA AARADHYA SIRI REDDY.
NT-331741

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

సిద్ధులగుట్టలో శ్రావణ మాస పూజలు

బచ్చన్నపేట, సెప్టెంబర్ 2 : శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సిద్ధేశ్వరుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన పూజారి ఓం నమఃశివాయ స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వంశీ, అర్చకులు సదాశివుడు, మహాశివుడు, సంగమేశ్వర్, సిబ్బంది శ్రీనివాస్, భానుప్రకాశ్ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక

తరిగొప్పుల, సెప్టెంబర్ 2 : మండలంలోని అంకుషాపూర్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా మామిడాల కనకయ్యను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దామోదర్‌ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు రాజు, ఎల్లయ్య, సుధాకర్, రామయ్య, వెంకటేశ్, రాజయ్య, మల్లయ్య, భాస్కర్, గాలయ్య, రాజు, నగేశ్, నర్సింహులు, ఎల్ల య్య పాల్గొన్నారు.

పాము రమేశ్‌కు ఘన సన్మానం

బచ్చన్నపేట, సెప్టెంబర్ 2 : కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డును అందుకున్న పాము రమేశ్‌ను సోమవారం పద్మశాలి సేవా సమితి ఘనంగా సన్మానించింది. మండల కేంద్రంలోని మార్కండేయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. పాము రమేశ్ ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడంతో అభినందనలు తెలిపారు.

వరదలతో వడ్లకొండ సమీపంలో ఒరిగిన కరెంటు స్తంభం

తెగిన రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

నర్మెటలో కూలిపోయిన ఇల్లు

పల్లగుట్ట ఊర చెరువును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

భారీ వర్షాలతో పంటలకు జీవం

- రిజర్వాయర్లు, చెరువుల్లోకి చేరుతున్న నీరు
- జిల్లాలో పలుచోట్ల దెబ్బ తిన్న రహదారులు
- తెరిపిచ్చిన వానలతో ఊపిరిపీల్చుకున్న జనం
- మరమ్మతులపై కలెక్టర్, అధికారుల చర్యలు

జనగామ, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ఏకధాటి వానలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు వాతావరణం సోమవారం తెరిపినివ్వడంతో జిల్లాలో సాధారణ పరిస్థితి నెలకొన్నది. ఉమ్మడి జిల్లాలో అతి భారీ వర్షాలు కురిశాయి. జనగామ జిల్లాలో మాత్రం మోస్తారు నుంచి భారీ వర్షం కురవడంతో ఎక్కడా ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు పెద్దగా జరగకపోవడంతో అటు ప్రజలు, ఇటు అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. ఈ వానకాలం సీజన్‌లో ఇవే పెద్ద వర్షాలు కావడంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లోకి భారీగా వరదనీరు చేరి భూగర్భజల మట్టాలు గణనీయంగా పెరిగాయి. జూన్‌లో మోస్తరు వర్షాలు కురిశాయి. జూలై, ఆగస్టు మాసాల్లో సాధారణ వర్షాలే నమోదు కావడంతో వానకాలం పంటలు చేతికొచ్చేనా అని రైతులు ఆందోళనకు గురయ్యారు. అల్పపీడనద్రోణి ప్రభావంతో రెండు రోజులు కురిసిన వర్షాలు పంటలకు ఊపిరిపోశాయి. వచ్చే యాసంగిలో సాగు, తాగునీటికి ఢోకాఉండదని అధికారులంటున్నారు. భారీ వర్షాలతో చెరువులు, కుంటలు సహా వాగులపై ఉన్న చెక్‌డ్యాములు నిండి మత్తడి పడుతున్నాయి. జనగామ మండలం చీటకోడూరు వాగు, రిజర్వాయర్, లింగాలఘనపురం మండలం కుందారం వాగును అధికారులు పరిశీలించి స్థానికులకు సూచనలు చేశారు. రాబోయే 48 గంటలపాటు వానలు కొనసాగే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం రెడ్ అలర్ట్ ప్రకటించింది. జనగామ పట్టణం సహా జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను గుర్తించి పునరావాస చర్యలకు ఆదేశించారు. వరదనీరు ప్రవహిస్తున్న లోలెవల్ కల్వర్టులను గుర్తించిన అధికారులు రాకపోకలు నిలిపివేసి సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షాలు, వరదలపై జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నారు. కోతకు గురైన రోడ్లు, కల్వర్టులు, నీట మునిగిన పంటలపై నివేదిక అందించాలని ఆదేశించారు. కాగా, జిల్లా మొత్తంగా 80.10 సెం.మీ వర్షపాతం నమోదైంది. సోమవారం 6.68 సెం.మీ సగటు వర్షం కురిసింది.అత్యధికంగా జనగామలో 9.66, నర్మెటలో 9.26, బచ్చన్నపేటలో 9.02, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 8.24, రఘునాథపల్లిలో 80.2 , తరిగొప్పులలో 76.8, జఫర్‌గడ్‌లో 73.8, చిల్పూర్‌లో 70.4 వర్షపాతం నమోదైంది. లింగాలఘనపురంలో 5.2, పాలకుర్తిలో 3.54, కొడకండ్లలో 3.3, దేవరుప్పులలో 1.76 సెం.మీ వర్షం కురిసింది.

వడ్లకొండ క్రాస్ రోడ్డు వద్ద తెగిన తాత్కాలిక రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వర్షాలతో దెబ్బ తిన్న రహదారి

నర్మెట : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వెల్దండ నాగుల చెరువు మత్తడి ఉధృతికి కల్వర్టు పై నుంచి వరదలు రావడంతో నర్మెటకు వెళ్లే రోడ్డు దెబ్బతింది. కల్వర్టు పైపులపై ఉన్న మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు జనగామ–నర్మెట రహదారిలో గానుగుపహాడ్ బ్రిడ్జి పక్కన రోడ్డు తెగిపోవడంతో వాహనాలను వెల్దండ దారిగుండా మళ్లించారు. మత్తడి లెవల్‌లో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నర్మెటలో కూలిన ఇల్లు..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నర్మెట మండల కేంద్రానికి ప్రజ్ఞపురం మల్లయ్య పెంకుటిల్లు కూలిపోయింది. తమను ఆదుకోవాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు బాధితుడు వినతిపత్రం అందించారు.

కాకయకుంటకు బుంగ..

పాలకుర్తి రూరల్ : భారీ వర్షాలతో మండలంలోని మల్లంపల్లి శివారు కాకయకుంట చెరువుకు బుంగ పడింది. దీంతో నీరు వృథాగా పోతున్నది. దీంతో యాసంగి పంటలకు సాగునీరు వృథా అవుతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఐబీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఐబీ డీఈ శ్రీకాంత్ శర్మను వివరణ కోరగా రెండు రోజుల్లో మరమ్మతులు చేపడుతామన్నారు.

చెరువును పరిశీలించిన అదనపు కలెక్టర్

చిల్పూరు : మండలంలోని పల్లగుట్ట ఊర చెరువును అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సోమవారం పరిశీలించారు. వరదలతో పల్లగుట్ట చెరువులోకి నీరు వస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువులు, కుంటల కట్టలను పరిశీలించి కోతకు గురైతే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ కాల్వల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి బాబు నాయక్ పాల్గొన్నారు.

తెగిన రోడ్డును వెంటనే పునరుద్ధరించాలి

అధికారులకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశం

జనగామ రూరల్, సెప్టెంబర్ 2 : వడ్లకొండ–గానుగుపహాడ్ రూట్‌లో తెగిన రోడ్డును పునరుద్ధరించి వంతెన నిర్మాణం చేపట్టాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రవాణ సౌకర్యం మెరుగుపర్చేందుకు గత ప్రభుత్వంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా సగం వరకు పనులు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించకపోవడంతో పనులు నిచిపోయాయని, ఈ క్రమంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోయిందన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాంతో జనగామ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బాల్దె సిద్ధిలింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బూరగోని యాదగిరి గౌడ్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చినబోయిన రేఖ, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షురాలు బొల్లం శారదతో కలిసి కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు, బ్రిడ్జి పనులను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అర్‌ఆండ్‌బీ డీఈ అశోక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పనులు త్వరగా పూర్తి చేయిస్తామని, సమస్యలుంటే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో మాట్లాడుతానని వివరించారు. చేసిన పనులకు ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా రోడ్లు, రవాణా, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

రాకపోకలను పునరుద్ధరించాలి : కలెక్టర్

భారీ వర్షాలతో తెగిపోయిన తాత్కాలిక రోడ్డును వెంటనే పునరుద్ధరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం వడ్లకొండ– గానుగుపహాడ్ క్రాస్ రోడ్డును అధికారులతో కలిసి పరిశీలించారు. వెంటనే పెద్దపైపులు వేసి తాత్కాలిక రోడ్డు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీవో ఉప్పుగల్లు సంపత్ కుమార్, మాజీ సర్పంచ్ సానబోయిన శ్రీనివాస్, వంగాల రేణుక శంకర్, నాయకులు బాలస్వామి, దండిగ సిద్ధులు, కొర్ర శంకర్ నాయక్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో అలసత్వంపై కలెక్టర్ ఆగ్రహం

పాలకుర్తి దవాఖాన రికార్డులు తనిఖీ చేసిన షేక్‌రిజ్వాన్‌బాషా

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 2: వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించమని, పది రోజుల్లో పనితీరులో మార్పు రాకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌సీ వైద్యుడు కే వెంకటేశ్వర్లు విధులకు హాజరుకాకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి సస్పెన్షన్‌కు సిఫారస్ చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. వంతుల వారీగా కాకుండా అందరూ నిబంధనలకు అనుగుణంగా విధులకు హాజరుకావాలని ఫార్మసిస్టులనుద్దేశించి అన్నారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ సిబ్బందికి ఒకే రోగుల హాజరు పట్టిక ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దవాఖాన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని కోరారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యానికి ఎస్టిమెట్ రెడీ చేయాలని పీఆర్ డీఈని ఆయన ఆదేశించారు, పది రోజుల్లో ఆకస్మిక తనిఖీ చేస్తానని వైద్యులు సిబ్బంది పనితీరులో మార్పు రావాలని కలెక్టర్ సూచించారు. వారం రోజుల్లో బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. త్వరలో వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తానన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి ఎన్ రవీందర్, డాక్టర్లు సిద్ధార్థ్‌రెడ్డి, స్ఫూర్తి, స్పందన, రాకేశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాకేశ్ ఉన్నారు.

దవాఖానలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

వెలుగు పాఠశాలలో విద్యార్థినులతో భోజనం చేస్తూ...

కస్తూర్బా, గురుకుల పాఠశాలల తనిఖీ

పాలకుర్తిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోడిగుడ్లు పెడుతున్నారా అని ప్రశ్నించగా 'పెట్టడం లేదు సార్..' అని విద్యార్థినులు చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకౌంటెంట్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జీసీడీవో గౌసీయాబేగంను ఆదేశించారు. అమ్మ ఆదర్శ కమిటీల పనులను పరిశీలించారు. స్టోర్‌రూంను తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఆనంతరం బాలికల గురుకుల పాఠశాల, గూడూరులోని ఎస్టీ ట్రైబెల్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. వెలుగు పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. 10/10 జీపీఏ సాధించాలన్నారు. గూడూరు హాస్టల్‌లో భవనాన్ని నాణ్యతగా నిర్మించాలని కోరారు. ఆయన వెంట డీఆర్‌డీవో ఎన్ వసంత, తహసీల్దార్ పీ శ్రీనివాస్, ఎంపీడీవో ఆవుల రాములు, ఆర్ఐ రాకేశ్, ప్రిన్సిపాల్ స్వరూపారాణి, మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య ఉన్నారు.

గద్దర్ అవార్డు గ్రహీత బురుగు రవికి ఘన సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 2 : మండలంలోని తాటికొండకు చెందిన కళాకారుడు బురుగు రవిని మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి సోమవారం సన్మానించారు. భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో నాలుగు రోజుల క్రితం గిద్దె రాంరస్యయ్య ఆధ్వర్యంలో తొర్రూరులో నిర్వహించిన గద్దర్ యాది సభలో గద్దర్ అవార్డును బురుగు రవి అందుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వివిధ రంగాల్లో రాణించి పుట్టిన ఊరుకు పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మారపాక రాములు, పాలకుర్తి నాగరాజు, బలిజ రాజు, బొల్లం నాగరాజు, మేకల అనిల్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

రవిని సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ సుధీర్ రెడ్డి

జోరు వానలోనూ విద్యుత్ పునరుద్ధరణ పనులు

సిబ్బందికి ట్రాన్స్‌కో అధికారుల అభినందన

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 2: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నా విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారు. సోమవారం మండలంలోని గూడూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రాణాలకు తెగించి గూడూరు ఊర చెరువులోని 11 కేవీ స్తంభంపైకి ఎక్కి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సం దర్భంగా కట్టర్ లక్ష్మణ్, సిబ్బంది బాలాజీ, శ్రీనివాస్‌ను ట్రాన్స్‌కో సీఈ సదర్‌లాల్, ఎస్ఈ తంగేళ్లపల్లి వేణు మాధవ్ అభినందించి సత్క రించారు. ఈ కార్యక్రమం లో ఏడీఈ తిలక్, ఏఈ ఆవిరినేని రణధీర్‌రావు, ఏఈ సత్తయ్య, మహేందర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

ధరావత్‌తండాలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

దేవరుప్పుల, ఆగస్టు 2: మండలంలోలోని ధరావత్ తండాలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధరావత్ తండాలో ధరావత్ నిమ్మా ఇంట్లో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం కనిపించడంతో సీజ్ చేశారు. ఎస్సై మాట్లాడుతూ రేషన్ బియ్యం డంప్ చేయడం, తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ శాఖకు స్వాధీనం చేసి కేసు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు

రేషన్ బియ్యం చూపుతున్న ఎస్సై సృజన్‌కుమార్

ఆర్థిక సాయం అందిస్తున్న రాజయ్య

మృతుడి కుటుంబానికి రాజయ్య పరామర్శ

జఫర్‌గడ్, సెప్టెంబర్ 2 : మండలంలోని తీగారానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఉద్దమారి ప్రభాకర్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సోమవారం ప్రభాకర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపి ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం ప్రభాకర్ అంతిమయాత్రలో రాజయ్య డప్పు కొట్టి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ పెంతల రాజ్‌కుమార్, జఫర్‌గడ్ గుట్ట మాజీ చైర్మన్ కోత్వాల కుమార్, నాయకులు మైసయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 2 : బీసీ కుల గణన చేపట్టిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దూడల సిద్ధయ్య గౌడ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిద్ధయ్య గౌడ్ మాట్లాడుతూ బీసీ జనాభా దామాషా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. విద్య, ఉద్యోగ రంగాల్లో అగ్రకులాల జనాభా ఏడు శాతం ఉంటే, ఈడబ్ల్యుఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, కార్యదర్శి చింతకింది మల్లేశ్, మాజీ ఎంపీటీసీలు సలేంద్ర శ్రీనివాస్, సింగారి ప్రశాంత్, కత్తుల శివశంకర్ యాదవ్, కూరాకుల నాగరాజు, యాసారపు కరుణాకర్, జంపన్న, మధు, పరశురాములు, కృష్ణంరాజు, కల్యాణ్ కుమ